


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 21-01-2023 | సంపుటి : 04 | సంచిక : 132 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# అంబేద్కర్ స్మృతివనంపై సమీక్ష..



తాడేపల్లి: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ స్మృతివనం, అందులో ఏర్పాటు చేయనున్న భారీ విగ్రహ పనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇవాళ సమీక్ష నిర్వహించారు.విగ్రహం తయారీ, దానిచుట్టూ చేపట్టిన సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే తదితర అంశాలపై ఆయన అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ క్రమంలో.. పనుల తీరును సీఎం జగన్‌కు అధికారులు వివరించగా.. ఆయన పలు కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది.విగ్రహ పీఠంతో కలుపి మొత్తంగా అంబేద్కర్

## నాణ్యతతో పాటు సుందరంగా ఉండాలన్న సీఎం జగన్ ఆదేశం

విగ్రహం 206 అడుగుల పొడవు వస్తుందని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు వ్యయం మొత్తంగా రూ.268 కోట్లు కాగా, పీఠం భాగంలో జీ ప్లస్ టూ నిర్మాణం ఉంటుంది. అలాగే.. ప్రాంగణంలో ఒక కన్వెన్షన్ సెంటర్ కూడా రానుంది. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నారు. మార్చి నెలాఖరు కల్లా విగ్రహ నిర్మాణ పనులు పూర్తిచేస్తామన్న అధికారులు.. జనవరి 31 కల్లా విగ్రహానికి సంబంధించి కాస్టింగ్ చేసిన భాగాలన్నీ తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు జరిగాయని తెలిపారు.ఇప్పటికే కొన్ని విగ్రహ భాగాలను తరలించామన్న అధికారులు.. దాదాపు 2 వేల మంది పట్టేలా కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కార్ పార్కింగ్, బస్ పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించామని, అలాగే అంబేద్కర్ స్మృతి వనానికి దారితీసే రోడ్లను సుందరీకరిస్తామని తెలిపిన అధికారులు.అధికారుల వివరణకు సీఎం జగన్ స్పందిస్తూ.. ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా అన్ని పనులు పూర్తిచేయాలని, నాణ్యత విషయంలో అస్సలు తగ్గొద్దని, అలాగే నిర్మాణాలు అందంగా ఉండాలని సూచించారు. పనుల పర్యవేక్షణకు ఉన్నతస్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు.

# పూర్తి కావస్తున్న సెంట్రల్ విస్టా పనులు

## కొత్త పార్లమెంట్ భవనాల ఫొటోలు విడుదల

న్యూఢిల్లీ,జనవరి20 : దేశ రాజధాని ఢిల్లీలో నిర్మిస్తున్న కొత్త పార్లమెంట్ భవనాన్ని ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నట్లు భావిస్తున్నారు. వేలకోట్లు కర్చు చేసి అద్భుతంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్త పార్లమెంట్‌కు చెందిన లేఅవుల్, ఫోటోలను ప్రభుత్వం విడుదల చేసింది. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ సముదాయ భవనాన్ని పార్లమెంట్ సెషన్ రెండవ భాగంలో ఓపెన్ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే పనులు పూర్తి కాకపోవడంతో మార్చిలో ఈ బిల్డింగ్‌లను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్



విస్టా రీడెవలప్మెంట్ ప్రణాళికలో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మిస్తున్నారు. టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఈ పనులు చేపడుతోంది. అత్యంత విశాలమైన హాల్స్, లైబ్రరీతో పాటు పార్కింగ్‌కు కావాల్సినంత స్థలాన్ని కల్పిస్తున్నారు. హాల్స్, ఆఫీసు రూములన్నీ ఆధునిక టెక్నాలజీకి తగ్గట్టు నిర్మించారు. కొత్త పార్లమెంట్ భవనంలో 888 సీట్లు కెపాసిటీతో లోక్‌సభ హాల్‌ను నిర్మించారు. ఇక రాజ్యసభ హాల్‌ను లోటస్ థీమ్ తరహాలో నిర్మించారు. రాజ్యసభలో 384 మంది సభ్యులు కూర్చునే రీతిలో దీన్ని కట్టారు. ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ భవనాల సమీపంలోనే కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌ను నిర్మించారు. కొత్త బిల్డింగ్ 65వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. అన్ని హంగులతో కాన్స్టిట్యూషన్ హాల్‌ను తీర్చిదిద్దారు. లేటెస్ట్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీతో అన్ని ఆఫీసుల్ని నిర్మించారు. కమిటీ రూముల్లో అత్యాధునిక ఆడియో విజువల్ సిస్టమ్స్ ఉంటాయి.

# దావోస్ లేఖపై తప్పుడు ప్రచారం...

## ఏపీ ప్రభుత్వం హెచ్చరిక

అమరావతి: దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనావి?క్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తూ రాసిన లేఖపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.సీఎంను ఆహ్వానిస్తూ నవంబర్ 25న వరల్డ్ ఎకనావి?క్ ఫోరం ప్రెసిడెంట్ బోర్జ్ బ్రెండే రాసిన లేఖ నకిలీదంటూ పచ్చ మీడియా తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టింది.తొలుత దావోస్‌కు సీఎంకు ఆహ్వానం అందలేదంటూ చేస్తున్న ప్రచారం అబద్ధమని తేలడంతో, ఆ లేఖ నకిలీదని మరో తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో డబ్ల్యూఈఎఫ్ రాసిన లేఖను యథాతథంగా విడుదల చేశామని, దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గురువారం ప్రభుత్వం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

# జీవో నెం.1పై సుప్రీంకోర్టులో విచారణ.. హైకోర్టుకు ఆదేశాలు



న్యూఢిల్లీ: జీవో నెం.1 పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. హైకోర్టులో విచారణ ఉన్నందున వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.ఈ నెల23న జీవో నెం 1పై హైకోర్టు విచారణ జరపాలని ఆదేశించింది. ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ విచారణ జరపాలని పేర్కొంది.కాగా ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1పై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఇచ్చిన స్టే ఎత్తివేయాలని సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో దీనిపై శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించారు.రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలపై విచారించే పరిధి వెకేషన్ బెంచ్‌కు లేదని కోర్టుకు తెలిపారు. తనకు లేని పరిధిలో వెకేషన్ బెంచ్ తీర్పు చెప్పిందని వాదించారు. ఉదయం 10:30కు కేసును మెన్షన్ చేసి.. ప్రతివాదుల వాదనలు వినకుండానే అదే రోజున తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు.ఏపీ ప్రభుత్వ వాదనను తన ఉత్తర్వులలో రికార్డు చేసిన సీజేఐ డీవై చంద్రచూడ్.. కేసు మెరిట్స్ లోపలికి వెళ్లడం లేదని తెలిపారు. హైకోర్టు తీర్పుపై ప్రస్తుతం జోక్యం చేసుకోలేమని అన్నారు.

ఏపీ ప్రభుత్వ పిటిషన్‌లోని ముఖ్యమైన అంశాలు

బహిరంగ సభలను నిషేధిస్తున్నట్లు జీవోలో ఎక్కడ ఒక పదం కూడా లేదు

చంద్రబాబు సభల్లో 11 మంది చనిపోయారు, సభలను అడ్డగోలుగా నిర్వహించారు

ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది

సభలపై అవసరమైన మేరకు మాత్రమే నియంత్రణలు విధించాం

జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రహదారులలో బహిరంగ సభలు పెట్టొద్దని కోరాం

ప్రత్యామ్నాయ ప్రాంతాలలో స్థలాలలో సభలు పెట్టుకోవాలని కోరాం

# ఉద్యోగుల సంఘం గవర్నర్‌ను కలవడం పబ్లిసిటీ స్టంట్: వెంకట్రామిరెడ్డి



అమరావతి/ విజయవాడ: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు గవర్నర్ బిష్వభూషణ్ హరిచందన్‌ను కలవడం పబ్లిసిటీ స్టంట్ అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య(జీఇఎఫ్) అధ్యక్షుడు వెంకట్రామి రెడ్డి అన్నారు.ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్టు ఆయన స్పష్టం చేశారు.కాగా, వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించిన తర్వాత గవర్నర్‌ను కలవడమేంటని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వీఆర్ఏలు, ఎండీవోలకు పదోన్నతులు వచ్చాయి. సచివాలయ ఉద్యోగులకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేయలేదా?. గతంలో ఉద్యోగుల సమస్యలపై ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు.అంతకు ముందు.. సూర్యనారాయణపై ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యనారాయణ ఉద్యోగ సంఘాలను విమర్శించడం మానుకోవాలి. ఆయన ఉద్యోగుల గురించి మాట్లాడితే బాగుంటుంది. మీరు ఛాంపియన్‌లా.. మమ్మల్ని చవటల్లా చిత్రీకరిస్తే ఊరుకోము. 11 పీఆర్సీలు సాధించిన ఘనత మా సంఘానిది. గవర్నర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై మాట్లాడకుండా మాపై విమర్శలు చేస్తున్నారు. నీ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను తాకట్టు పెట్టొద్దు. సీఎం వైఎస్ జగన్ చర్చలకు పిలిస్తే.. నువ్వు ఎందుకు శ్రీకాకుళం పారిపోయావు అని ప్రశ్నించారు.

# ఎల్‌జీ సాబ్..రాజకీయాలను పక్కనపెట్టి శాంతిభద్రతలు కాపాడండి : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా రాజకీయాలను పక్కనపెట్టి దేశ రాజధానిలో శాంతి భద్రతల పరిస్థితిపై దృష్టి సారించాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సూచించారు. ఢిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) చీఫ్ స్వాతి మలివాల్‌ను ఓ వ్యక్తి వేధింపులకు గురిచేసి కారుతో ఈడ్చుకెళ్లిన ఘటన కలకలం రేపిన నేపథ్యంలో ఎల్‌జీపై కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు.ఢిల్లీలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉందని ప్రశ్నించిన కేజ్రీవాల్ గూండాల నైతిక స్థైర్యం పెరిగి చివరికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కే భద్రత లేని పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌జీ సాబ్ కొద్దిరోజులు రాజకీయాలను పక్కనపెట్టి నగరంలో శాంతి భద్రతలపై దృష్టిసారించాలని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.శాంతి భద్రతల పర్యవేక్షణలో తాము ఆయనకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్‌ను గురువారం తెల్లవారుజామున తప్పతాగిన కారు డ్రైవర్ వేధిస్తూ ఆమె చేయి కారు విండోలో చిక్కుకుపోవడంతో 15 మీటర్ల దూరం ఈడ్చుకువెళ్లిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో డ్రైవర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. అతడి కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# మేం రాష్ట్ర ప్రభుత్వానికి దగ్గర కాలేదు: ఏపీఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి డీఏ, ఇతర బకాయిలను చెల్లించలేదని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు.ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు ఉద్యోగ సంఘాల నేతలుగా సిగ్గు పడుతున్నామన్నారు. వేతనాల కంటే ముందు పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మర్యాద నిలబెట్టుకోవాలని బండి శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ఎన్జీవో కార్యవర్గంతో పాటు జేఏసీ సమావేశాల్లో చర్చించి తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి దగ్గర కాలేదని.. ఉద్యోగుల ప్రయోజనాల కోసమే పోరాడుతోందని బండి శ్రీనివాసరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను గవర్నర్ దగ్గర చెప్పుకోవాలి తప్ప.. ఇతర సంఘాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడు సూర్యనారాయణను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. ఏపీ ఎన్జీవో సంఘం చాలా ఏళ్ల క్రితం ఏర్పడిందన్నారు. ఏపీజీఈఏకు అనుమతి ఎలా



వచ్చిందో అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్జీవో సంఘం సాధించిన కారుణ్య నియామకాల ఉత్తర్వుల ద్వారానే సూర్యనారాయణకు ఉద్యోగం వచ్చిందన్నారు. సూర్యనారాయణ అధ్యక్షత వహిస్తున్న సంఘం గుర్తింపు రద్దు చేయాలని సీఎస్‌ను కోరతామన్నారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని చట్టాలు, నిబంధనలు ఉన్నాయని.. కానీ ప్రభుత్వం పాటించడం లేదని బండి శ్రీనివాసరావు అన్నారు.

# ఐటీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఇన్ఫినిటీ వైజాగ్

**రాష్ట్రంలో ఐటీ పెట్టుబడుల అవకాశాలపై విశాఖలో రెండురోజుల సదస్సు**

**వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖరన్**

**హాజరుకానున్న ఐటీ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర అధికారులు**

**12 ఐటీ, ఐటీ ఆధారిత సంస్థలు స్టాల్స్ ఏర్పాటు**

విశాఖపట్నం: ఐటీ రంగంలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతోపాటు పలు ఐటీ కంపెనీలను ఆకర్షించే విధంగా రెండురోజుల 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. ఐటీ పెట్టుబడుల ప్రధాన ఆకర్షణగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇన్ఫినిటీ వైజాగ్ పేరుతో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సు నిర్వహిస్తోంది. ద్వితీయ శ్రేణి నగరాల వైపు ఐటీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్న తరుణంలో వైజాగ్‌లో ఉన్న మెరుగైన అవకాశాల్ని ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.కేంద్ర ఐటీశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖరన్ వర్చువల్‌గా ప్రారంభించే ఈ సదస్సులో రెండోరోజు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారు.

# సంపాదకీయం

శనివారం 21-01-2023

## ఆర్థిక సంక్షోభంలో దాయాది దేశం

భారత ఉపఖండంలో శ్రీలంక ఆర్థిక సంక్షోభాన్ని మరువక ముందే మరొక దేశం పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని విలవిలలాడుతున్నట్లుగా కనిపిస్తుంది రోజురోజుకీ అడుగంటి పోతున్న విదేశీ మారకద్రవ్య నిల్వలు, వేగంగా పతనమవుతున్న పాకిస్తాన్ రూపాయి విలువ, తీవ్ర ద్రవ్యోల్బణంతో ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెద్ద ఎత్తున పెరిగిన విదేశీ రుణ భారం కారణంగా... పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం దిశగా పయనిస్తోంది. గత ఏడాది 16.6 బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ మారక ద్రవ్య నిలువలు ప్రస్తుతం 5.6 బిలియన్ డాలర్లకు చేరుకొని మూడు వారాల దిగుమతులకు మాత్రమే సరిపోయే స్థాయికి విదేశీ మారకద్రవ్య నిల్వలు పడిపోయాయి. దీంతో గ్యాస్, పెట్రోలియం ఇంధనం వంట నూనెలు లాంటి వస్తువులను దిగుమతి చేసుకోటానికి పాకిస్తాన్ తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. దేశంలో ద్రవ్యోల్బణం 42 శాతానికి చేరుకోవటంతో వంట నూనెలు గోధుమపిండి నెయ్యి లాంటి నిత్యావసర వస్తువుల ధరలు పెద్ద ఎత్తున పెరిగిపోతున్నాయి వంట నూనెలను అత్యవసర వస్తువుల జాబితా నుండి తొలగించారు. 15 కిలోల గోధుమపిండి బ్యాగ్ ధర రూ. 2050లకు చేరుకుంది. అలాగే కిలో ఉల్లిపాయల ధర 2022 రూపాయలకు చేరుకుంది. ప్రభుత్వం వివిధ వస్తువుల పైన ఇచ్చేటటువంటి సబ్సిడీలు తొలగించడం వలన వినియోగ వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి సబ్సిడీ పైన ప్రభుత్వం ఇచ్చే గోధుమపిండి కోసం ప్రజలు పడిగాపులు కాయడమే కాదు మరికొన్ని చోట్ల తొక్కిసలాటలు కూడా జరుగుతున్న ఉదంతాలు కనపడుతున్నాయిపాకిస్తాన్‌లో ఒకవైపు ఆర్థిక సంక్షేభం మరొకవైపు ఆహార సంక్షోభం భవిష్యత్తులో తలెత్తే అవకాశం కనబడుతోంది. రష్యా నుండి నాలుగు లక్షల 50 వేల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవడం వలన ఆహార సంక్షోభాన్ని అధిగమిస్తామని పాకిస్తాన్ భావిస్తోంది. కానీ రాబోయే రంజాన్ మాసం నాటికి ఆహార కొరత పాకిస్తాన్‌లో మరింత తీవ్రమయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి. డాలర్‌తో పాకిస్తాన్ రూపాయి మారకం విలువ రూ. 227లుగా రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపెడుతోంది ఇంధనం, పెట్రోలు, గ్యాస్ లాంటి కీలకమైన వినియోగ వస్తువులను దిగుమతి చేసుకోవడానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటి పోవటం వలన పాకిస్తాన్ ప్రభుత్వం ఇంధన పొదుపు చర్యలకు ఉపక్రమించింది. దీంట్లో భాగంగా రాత్రి ఎనిమిదిన్నర గంటలకే మార్కెట్ల మూసివేత పది గంటలకే రెస్టారెంట్లు ఫంక్షన్ హాల్‌ల మూసివేత లాంటి చర్యలు చేపట్టిందంటే అక్కడి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2021 నాటికి పాకిస్తాన్ అప్పులు 29 లక్షల 51 వేల కోట్ల రూపాయలకి చేరుకోవటంతో అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి, మిత్ర దేశాల నుండి కొత్త అప్పులు పుట్టని స్థితిలోకి పాకిస్తాన్ దిగజారిపోయింది. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి లాంటి ద్రవ్య సంస్థలు అప్పు ఇవ్వటానికి నిరాకరిస్తున్నాయి. దీంతో పాకిస్తాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. పాకిస్తాన్‌లో ఇంతవరకు ఏర్పడిన పౌర ప్రభుత్వాలన్నీ సైన్యం చెప్పు చేతులలో ఉంటూ, వారి దయాదాక్షిణ్యాల పైన ఆధారపడి పనిచేయటం వలన రాజకీయ అస్థిరతతో ఆ దేశం భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంటే, ప్రధానమంత్రి పదవిని కాపాడుకోవడానికి మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, అధికారంలోకి రావడానికి ప్రస్తుత ప్రధాని షాబాజ్ షరీఫ్ రాజకీయాలలో మునిగి తేలటం కూడా పాకిస్తాన్ ప్రస్తుత స్థితికి కారణంగానే భావించాలి. పాకిస్తాన్ పాలకులు బెనజీర్ భుట్టో, ఆసిఫ్ అలీ జర్దారి, నవాజ్ షరీఫ్, పర్వేజ్ ముషారఫ్, ఇమ్రాన్ ఖాన్... ఇలా అందరి పైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవల వరకు ఆ దేశ సైన్యాధ్యక్షుడిగా పనిచేసిన జనరల్ బాజ్వాపై కూడా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి అంటే పాకిస్తాన్‌లో అవినీతి ఏ స్థాయిలో వేళ్ళూనుకుపోయిందో అర్థమవుతుంది. పాలకుల అవినీతి దేశ ఆర్థిక వ్యవస్థని పెద్ద ఎత్తున దెబ్బతీసింది. పాలకులు పాకిస్తాన్‌ని ఉగ్రవాద స్థావరంగా మార్చటం, ఆఫ్గన్ పరిణామాలు ప్రతికూలంగా మారటం, కాశ్మీర్‌లో ఉగ్రవాద ప్రేరిత కార్యకలాపాలకి ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం, భారత్ నుండి భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉంది అనే అపోహలతో రక్షణ రంగంపై అవసరానికి మించి బడ్జెట్‌లో ఖర్చు చేయడం, చైనా నుండి పెద్ద ఎత్తున అప్పులు తీసుకోవడం వంటి కారణాలు పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి దారితీశాయి. ఇప్పటికైనా పాకిస్తాన్ పాలకులు భారత్‌పై తమ గుడ్డి వ్యతిరేకతను పక్కనపెట్టి వ్యాపార, రక్షణ, శాంతి, ఆర్థికపరమైన దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకుంటే అంతర్జాతీయంగా కలిసి వస్తుంది. ఉగ్రవాద కార్యకలాపాలకు స్వస్తి చెప్పి ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో స్నేహ సంబంధాలు ఆర్థిక సంబంధాలు వ్యాపార సంబంధాలు మెరుగుపరచుకోకపోతే పాకిస్తాన్ మరింత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. పాకిస్తాన్ ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడటానికి 30 బిలియన్ డాలర్లు అవసరమవుతుందని రాబోయే ఆర్థిక సంవత్సరంలో పాకిస్తాన్ వృద్ధిరేటు కేవలం రెండు శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు అంచనా. కాబట్టి ఆర్థిక సంక్షోభం మరింత ముదరకముందే పాక్ ప్రభుత్వం మరికొన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. పాకిస్తాన్ రాజకీయ ఆర్థిక పరిణామాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ భారత్‌పై కూడా పడే అవకాశం ఉంది.

## తండ్రి వర్సెస్ తండ్రి.. కొడుకు వర్సెస్ కొడుకు..

తిరుపతి, జనవరి 20,నారా- పెద్దిరెడ్డి.. ఆ రెండు కుటుంబాలకున్న రాజకీయ వైరం ఈనాటిది కాదు. చంద్రబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇద్దరూ రాజకీయాల్లో సమకాలికులు. విద్యార్థి రాజకీయాల నాటి నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. యూనివర్శిటీలో స్టూడెంట్ డేస్ నుంచి ప్రస్తుత పొలిటికల్ లీడర్స్ వరకూ.. సేమ్ వార్ నాన్ స్టాప్ గా కంటిన్యూ అవుతూనే ఉంది.దాదాపు ఐదు దశబ్దాల పాటు వీరిద్దరి మధ్య నడుస్తోన్న రాజకీయ యుద్ధం ఇటు జిల్లా రాజకీయాల్లోనే కాదు అటు స్టేట్ పొలిటిక్స్ లోనూ వాడీ వేడీ చర్చనీయాంశమే. వర్సిటీ లెవల్లో పెద్దిరెడ్డిది పైచేయి కాగా.. రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం చంద్రబాబు సీఎంగా చక్రం తిప్పడంతో డామినేట్ చేయగలిగారు. ఇప్పటికీ ఈ ఇద్దరి మధ్య ఆ కాక.. నువ్వా- నేనా అన్నట్టుగా కొనసాగుతూనే ఉంది. 2019 ఎన్నికల తర్వాత చంద్రబాబు పెద్దిరెడ్డి మధ్య ముగిసిందనుకున్న రాజకీయ యుద్ధం మరింత వేడెక్కింది. కుప్పం నుంచి చంద్రబాబు- పుంగనూరు నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న పెద్దిరెడ్డి.. మధ్య మాటల యుద్ధం మరోమారు పీక్ స్టేజ్ కి చేరింది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరుకుంది.నలభై ఏళ్లుగా బాబు ప్రాతినిథ్యం వహిస్తోన్న కుప్పంపై పెద్దిరెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. అంతే కాదు.. లోకల్ బాడీ ఎలెక్షన్స్‌లో చంద్రబాబుపై పెద్దిరెడ్డిది అప్పర్ హ్యాండ్ అయ్యింది కూడా. దీంతో పెద్దిరెడ్డిని తన ఫస్ట్ టార్గెట్‌గా ఫిక్స్ చేశారు చంద్రబాబు. పెద్దిరెడ్డి తన కంచుకోట కుప్పంలో పై చేయి సాధిస్తుండటంతో చంద్రబాబు.. ఈ నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో ఈ చిరకాల ప్రత్యర్థుల మధ్య తిరిగి అగ్గిరాజుకుంది.చంద్రబాబు వరుసగా కుప్పం పర్యటనలు చేయడంతో పాటు.. పుంగనూరు మీద కూడా భారీగానే దృష్టి సారించారు. దీంతోనే బాబు పర్యటనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. దాడులు- కేసులు- అరెస్టులు కొనసాగడంతో మరోమారు వీరిద్దరి మధ్య అలనాటి హీటెడ్ పాలిటిక్స్ తిరిగి స్టార్టయ్యాయి. మరోవైపు పుంగనూరులో టీడీపీ కేడర్ పై దాడులు- కేసులు నమోదు కావడంతో చంద్రబాబు సైతం పెద్దిరెడ్డిపై డైరెక్ట్ అటాక్ చేయడం స్టార్ట్ చేశారు.సంక్రాంతి పండగకు సొంత జిల్లాకు వచ్చిన చంద్రబాబు.. పెద్దిరెడ్డే ప్రధాన లక్ష్యంగా వరుసగా మూడు రోజుల పాటు.. హెచ్చరికలు జారీ చేశారు. పెద్దిరెడ్డిని డైరెక్ట్ అటాక్ చేయడంలో భాగంగా ఈసారికి పుంగనూరు పుడింగి ఎలా గెలుస్తాడో చూస్తానంటూ ఛాలెంజ్ చేశారు. దీంతో వీరిద్దరి మధ్య పొలిటికల్ వార్.. సెమీ క్లైమ్యాక్స్ కి చేరినట్టయ్యింది. సరిగ్గా ఇదే సమయంలో పెద్దిరెడ్డి కూడా చంద్రబాబుకు గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. అధికారంలో ఉన్నపుడే ఏమీ చేయలేక పోయిన బాబు.. ఇప్పుడేం చేయగలరని ఎద్దేవా చేశారు. కుప్పంలో ఈసారి డిపాజిట్ రావడం కష్టమని.. నేరుగా ఆయనపై పోటీకి సైతం తాను సై అన్నారు. సీఎం జగన్ ఆదేశిస్తే.. ఇటు కుప్పంలో అయినా, అటు పుంగనూరులో అయినా చంద్రబాబుపై పోటీ చేయడానికి సిద్ధమేనని అన్నారు. ఆల్రెడీ కుప్పం స్థానిక సంస్థల ఎన్నికల్లో బాబుకు గట్టి షాకివ్వగలిగిన తాము.. ఈసారికి ఇక్కడ జెండా పీకేయడం ఖాయమని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఇక పెద్దిరెడ్డికి ఉన్న దమ్ము ధైర్యం చంద్రబాబుకు ఉందా? అంటూ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మరో సవాల్ విసిరారు. పుంగనూరులో అయినా, కుప్పంలో అయినా పెద్దిరెడ్డితో తలపడే ధైర్యం బాబుకు ఉంటే సిద్ధం కావాలంటూ నారాయణస్వామి విసిరిన ఛాలెంజ్ చిత్తూరు పొలిటికల్ సర్కిల్స్ లో మరింత హీటు పెంచింది.ఇద్దరు పెద్ద తలకాయల మధ్య రాజకీయ రణభేరి ఈ స్థాయిలో సాగుతోంటే.. వారి వారసుల మధ్య కూడా ఢీ అంటే ఢీ అనే వాతావరణమే కనిపిస్తోంది. లోకేష్ బాబు పాదయాత్ర మీద మీ అభిప్రాయమేంటని పెద్దిరెడ్డి కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డిని అడగ్గా.. లోకేష్ మాత్రమే కాదు కేఏపాల్, పవన్ సహా ఎవరైనా సరే రాష్ట్రంలో యాత్రలు చేసుకోవచ్చనీ. అయితే లోకేష్ కూడా.. తన తండ్రిలా ఫ్రస్టేషన్ కొద్దీ అదుపు తప్పి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని గట్టి హెచ్చరికలే జారీ చేశారు మిథున్ రెడ్డి.అంటే తరతరాల పెద్దిరెడ్డి- నారా కుటుంబాల రాజకీయ పోరాటంలో వారసులు కూడా తగ్గేదే లేదంటున్నారన్నమాట. మరి చూడాలి. తండ్రులే కాకుండా కొడుకుల మధ్య ఈ మాటల యుద్ధం ఇంకెంత పదునెక్కుతుందో.. అని కామెంట్ చేస్తున్నారు జిల్లా రాజకీయ రంగాల వారు.

## ఇక ఈజీగా ఆధార్ కార్డు మార్పు




విజయవాడ, జనవరి 20,ఆధార్ కార్డులో పేరులో స్పెల్లింగ్ మిస్టేక్స్ లేదా ఫోటో మార్చుకోవడం.. లేకపోతే అడ్రస్ మార్చుకోవడం చాలా పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇటీవల కేంద్రం పదేళ్లకోసారి అప్ డేట్ చేయించుకోవాలని చెబుతోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో వైపు ఆధార్ కేంద్రాలు తగ్గిపోయాయి. ఈ బాధల నుంచి విముక్తి కల్పించడానికి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని అప్?డేట్ చేయడానికి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాట్లు చేసింది. జనవరి 19, 20,21,23,24 తేదీల్లో వరుసగా ఐదురోజుల పాటు ఆధార్ అప్?డేట్ సేవలు ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. మళ్లీ ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రెండో విడత క్యాంపులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులు ఉంటే పనులన్నీ నిలిచిపోయతాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు రాష్ట్రంలో దాదాపు 80లక్షల మంది ఆధార్ అప్ డేట్ చేసుకోని వారున్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిని పరిష్కరించేందుకు ప్రత్యేక క్యాంపులతో ఆధార్ అప్ డేట్ కు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఇవేకాకుండా ఆధార్ కార్డుల జారీ సంస్థ యుఐడిఏఐ మధ్యే కొత్తగా తీసుకువచ్చని నిబంధనల ప్రకారం 10ఏ ళ్లకోసారి ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్ డేట్ చేసుకోవల్సిందేనని తెలిపింది. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ సాషన్‌మోహన్ అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామ వార్డు సచివాలయాల శాఖ జిల్లాల ఇన్‌చార్జి అధికారులు, జిల్లాల విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇవాళ్టి నుంచి రాష్ట్ర ప్రజలందరికి ఈ క్యాంపులు అందుబాటులోకి రానున్నాయి. ఆధార్ అప్ డేట్ చేసుకునే వెసులుబాటును కల్పించారు.ఆధార్ కార్డ్ అడ్రస్ అప్‌డేట్ కోసం కొన్ని ధృవపత్రాలు తీసుకెళ్లాలి. ఎవరైనా ఆధార్ కార్డ్‌లో పుట్టిన తేదీని తప్పుగా నమోదు చేసినట్లయితే అది ఒక్కసారి మాత్రమే మార్పు చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత అందులో ఎలాంటి మార్పులు చేయరు. ఆధార్ కార్డ్ సమాచారాన్ని మార్చేటప్పుడు, మీరు అప్‌డేట్ రిక్వెస్ట్ నంబర్ ని సురక్షితంగా ఉంచాలని గుర్తుంచుకోవాలి ఎందుకంటే ఇది కార్డ్ ప్రాసెస్ అయిందో లేదో ట్రాక్ చేయడానికి ఉపయోగించబడుతుంది. మీ మొబైల్ నంబర్ రిజిస్టర్ చేయకున్నా.. గ్రామ, వార్డు సచివాలయ కేంద్రాల్లో చేస్తారు. రుజువుగా అభ్యర్థించిన పత్రాలను మాత్రమే జతచేసి దరఖాస్తుతో అందించాలి. సవరించిన ఆధార్ కార్డు రిజిస్టర్డ్ చిరునామాకు

## బుచ్చయ్య చౌదరి దారెటు....



రాజమండ్రి, జనవరి 20, గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. తెలుగు దేశం పార్టీలో సీనియర్ నాయకుడు. పలు పర్యాయాలు శాసన సభ్యునిగా, చాలాసార్లు మంత్రిగా పని చేసిన అనుభవజ్ఞ నాయకుడు. అప్పట్లో దివంగత నందమూరి తారక రామారావునకు అత్యంత ఆప్తుడు, తాజాగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అంతరంగికుడు. రాజమండ్రి రూరల్ నందు చక్రం తిప్పుతున్న నాయకుడు. గత రెండు పర్యాయాల నుంచి ఇదే నియోజకవర్గంలో టీడీపీ తరుపున పోటీ చేసి వరుస గెలుపును సాధిస్తున్న నాయకుడు. అంతటి పేరు ప్రఖ్యాతలున్న బుచ్చయ్య చౌదరి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వయస్సు మీద పడటం, యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ యువ నేత లోకేష్ ఆదేశాలు జారీ చేయడం, రాజమండ్రి రూరల్ స్థానం జనసేనకు కేటాయించే ఆలోచనలో ఉండటం, ఇటువంటివి బుచ్చయ్యను చుట్టుముట్టాయి. 2024 ఎన్నికల్లో కూడా బుచ్చయ్యకు పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నా అదిష్టానం మాత్రం సహకరించే యోచనలో లేదు. దీనికి తోడు రాజమండ్రి సిటీలో బుచ్చయ్య చాలా మంది నాయకులతో వైరం ఉండటంపెద్ద మైనస్‌గా చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకుగా ఉన్న బుచ్చయ్య చౌదరి తొలి నాళ్లలో రాజమండ్రి సిటీలో తన రాజకీయ ప్రస్తానం ప్రారంభించారు. చాలామార్లు శాసన సభ్యుడిగా గెలిచారు. పలుమార్లు మంత్రిగా కూడా పని చేశారు. టీడీపీలో పాత తరం నాయకుల్లో బుచ్చయ్య పేరు ప్రదమ వరుసలో ఉంటుంది. అదీగాక దివంగత నందమూరి తారక రామారావుతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. 1995 ఆగస్టులో పార్టీ సంక్షోభంలో పడిన సమయంలో జిల్లాలో చాలా మంది నేతలు చంద్రబాబు వెంట వెళ్లగా బుచ్చయ్య మాత్రం నాడు నందమూరి తారక రామారావుతోనే ఉండిపోయారు. ఎన్టీఆర్ మరణించిన తర్వాత లక్ష్మీపార్వతీ వెంట ఉన్నారు. అలా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొన్నారు. కొంత కాలానికి చంద్రబాబు పంచన చేరారు. నాటి నుంచి టీడీపీలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. చంద్రబాబు కూడా బుచ్చయ్యకు రాజమండ్రి సిటీ సీటు ఇచ్చేవారు. మధ్యలో రాజమండ్రికి చెందిన టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు మీద వైరంతో పార్టీకి రాజీనామా చేస్తానని అన్నారు. దీంతో అప్పటి యంపీ మురళీ మోహన్ బుచ్చియ్యను అప్పటి యంపీ మురళీ మోహన్ బుజ్జగించారు. ప్రస్తుతం బుచ్చయ్య 2009లో సిటీ నుంచి గెలుపొందగా, 2014,2019లో రాజమండ్రి రూరల్ నుంచి వరుస గెలుపులు సాధిస్తూ వస్తున్నారు.రాజమండ్రి సిటీ యంఎల్ఏ ఆదిరెడ్డి భవానీ అదే పార్టీకి చెందిన వ్యక్తి అయినా సరే శాసన సభ్యుడు బుచ్చయ్య చౌదరితో వైరం ఉంది. కేవలం భవానీతోనే కాకుండా ఆమె మామ ఆదిరెడ్డి అప్పారావు, భర్త వాసుతో కూడా వైరం ఉంది. దీంతో సిటీలో వీరిద్దరి మధ్య నిప్పు, ఉప్పుగా వైరం నడస్తుంది. దీంతో బుచ్చయ్య వర్గం ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. వచ్చే ఎన్నికల్లో బుచ్చయ్యకు సీటు ఇస్తే భవానీ వర్గం మద్దతు ఇచ్చేలా లేదు. వీరిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి అధినేత చంద్రబాబు చాలామార్లు ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. దీంతో రోజు రోజుకు వర్గ విభేదాలు పెరిగిపోతున్నాయి.2024 ఎన్నికల్లో బుచ్చయ్య చౌదరికి సీటు ఇచ్చే ఆలోచన లేనట్లు సమాచారం. రాజమండ్రి రూరల్ స్థానం మిత్ర పక్షంలో భాగంగా జనసేకు కేటాయిస్తారని తెలుస్తోంది. అక్కడ జనసేన ఇంఛార్జి కందుల దుర్గేష్ పోటీ చేయనున్నట్లు సమాచారం. దీంతో బుచ్చయ్యకు రూరల్‌లో సలాం చెప్పే యోచనలో అధిష్టానం ఉంది. ఇక సిటీ విషయానికి వస్తే బుచ్చయ్యకు ఎంతమాత్రం స్థానం లేదు. ఎంఎల్ఏ ఆదిరెడ్డి భవానీ భర్త వాసు బీసీ కోటాలో సీటు కావాలని పట్టు పడుతున్నారు. అదీగాక యువ నాయకుడు, దీనికి తోడు అతను దివంగత ఎర్రం నాయుడు అల్లుడు అవ్వడంతో సీటు సాధించుకోవడానికి వాసుకు అన్ని అర్హతలు ఉన్నట్లు సమాచారం. అయితే భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

## రెండుగా చీల్చిన ఉద్యోగ సంఘాలు

విజయవాడ, జనవరి 20, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఉదయం సూర్యనారాయణరావు ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో గవర్నర్‌ను కలిసి ఏపీ ప్రభుత్వ జీతాలు, బకాయిలు సరిగ్గా చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతల పై ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాస రావు మండిపడ్డారు. అధికారంతో గవర్నర్ ను కలసి ఫిర్యాదు చేశారని నిలదీశారు. చట్ట విరుద్ధంగా సూర్యనారాయణతో పాటు ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కే.వి. శివారెడ్డి, పలువురు ప్యానల్ సభ్యులు కలిశారు.ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు ప్యానల్, కు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు గవర్నర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు,పెండింగ్ సమస్య లపై ఫిర్యాదు చేయటాన్ని తప్పు పట్టారు. సూర్య నారాయణ కు కావాల్సింది సొంత ప్రయోజనాలేనని, ఉద్యోగుల ప్రయోజనాలు కాదని బండి ఆరోపించారు.అంతే కాదు సూర్య నారాయణ మాటలకు అర్థం పర్థం లేదని ఫైర్ అయ్యారు. టెలిగ్రామ్ లో నెంబర్లు చూపించి వారి సంఘంలో లక్షన్నర మంది సభ్యులు ఉన్నారని సూర్యనారాయణ చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 12 పీఆర్సీలు తెచ్చిన సంఘం తమదని అన్నారు. 72 ఏళ్ళ చరిత్ర ఉందని గుర్తు చేశారు. నర్సాపురంలో పోటీ చేసి రెండు ఓట్లు మాత్రమే తెచ్చుకున్న వ్యక్తి అని ఎగతాళి చేశారు. గవర్నర్ కు ఫిర్యాదు చేసే అధికారం ఉద్యోగ సంఘాలకు లేదన్నారు. ఫిర్యాదు చేయటం చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. అలాంటి చర్యలకు పాల్పడిన సూర్య నారాయణ పై చర్యలు తీసుకోవాలని బండి డిమాండ్ చేశారు.ప్రతి నెల ఒకటిన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే విధంగా చట్టం చెయ్యాలని ఏపీ ఉద్యోగ సంఘ ప్రతినిధులు గవర్నర్ విశ్వభూషన్ ను కలిశారు.ఉద్యోగుల ఆం బకాయిలు, జీపీఎఫ్ బజాయిలు, సీపీఎస్ వాటా నిధులు 10వేల కోట్ల పైన ప్రభుత్వం బకాయి ఉందన్నారు, ఉద్యోగ సంఘ నాయకులు సూర్యనారాయణ..ఉద్యోగులు ఆందోళన చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదన్న విషయాన్ని కూడ ఆయన గవర్నర్ కు ఫిర్యాదు చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మమ్మల్ని రక్షించాలని గవర్నర్ ను కలిశామని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు,పెన్షనర్లు,దినసరి కార్మికులకు చెల్లించాల్సిన నిధులు నెల చివరి రోజు లేదా తర్వాత నెల మొదటి రోజు చెల్లించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ కు జీవోలతో సహా అన్ని వివరాలు వివరించామని.. ప్రభుత్వం నుంచి మొదటి చెల్లింపుదారుడిగా క్లెయిమ్స్ సెటిల్ చేసేలా చట్టాన్ని తీసుకురావాలని గవర్నర్ ను కోరామన్నారు.తగిన చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోని పక్షంలో ఏప్రిల్ నుంచి తీవ్ర ఆందోళనకు సిద్ధమవుతున్నామనిన వివరించారు. అయితే ఇది ఏపీఎన్జీవోస్ సంఘం అధ్యక్షుడికి నచ్చలేదు.

## 28న ఒక్కరోజు రథోత్సవం

తిరుమల, జనవరి 20, తెలుగు సంవత్సరంలో పదకొండవ నెల మాఘమాసం. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈ మాసం విష్ణుమూర్తికి ప్రీతిప్రథమైనది. పూజలకు శుభకార్యాలకు మాఘ మాసం విశిష్టమైంది. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించిన తరువాత వచ్చే మాఘ శుద్ధ సప్తమి రోజును రథసప్తమిగా వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. మాఘమాసంలో మాఘ శుద్ధ సప్తమిని ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుడు పుట్టిన రోజుగా భావించి అత్యంత ఘనంగా హిందువులు జరుపుకుంటారు. ఈ నెల జనవరి 28 వ తేదీన రథసప్తమి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోని సూర్య భగవానుడు పూజలను అందుకుంటున్న అరసవెల్లి సహా అనేక ప్రముఖ పుణ్యక్షేత్రాలు రథ సప్తమి వేడుకలను రెడీ అవుతున్నాయి. సూర్య జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి క్షేత్రంలో రథ సప్తమి వేడుకలను అత్యంత ఘనంగా టీటీడీ నిర్వహించడానికి సర్వం సిద్ధం చేస్తోంది.తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగే రథసప్తమి వేడుకలను మినీ బ్రహ్మోత్సవాలు అంటారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీనివాసునికి ఈ రోజున ఏడు వాహనాల సేవలను ఒకే రోజు నిర్వహిస్తుంది టిటిడి పాలకమండలి. తిరుమాడ వీధులలో స్వామి వారు ఏడు వాహనాలలో ఊరేగుతారు ఊరేగుతారు. ఉదయం సూర్య ప్రభ వాహనంతో మొదలై రాత్రి చంద్ర ప్రభ వాహనంతో ముగుస్తుంది..రథ సప్తమి వేడుకలు ఆ రోజు ఉదయం సూర్యప్రభ వాహనసేవతో ప్రారంభమై చిన్నశేష వాహనం, గరుడ వాహన సేవ, హనుమంత వాహనసేవ , కల్పవృక్ష వాహన సేవ , సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనం ఉరేగింపుతో రథసప్తమి వేడుకలు ముగుస్తాయి. మధ్యాహ్నం చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోన్న సంగతి తెలిసిందే. రథసప్తమి రోజున ఒకేసారి ఏడు వాహనాలు చూసే అవకాశం ఉండడంతో భారీ సంఖ్యలో భక్తులు తిరుపతికు చేరుకుంటారు. వాహనాలపై ఊరేగుతూ.. భక్తులకు అభయమిచ్చే శ్రీవారిని దర్శించుకుని పులకించి పోతారు.

## చెత్త మాటున గమ్మత్తు

విశాఖపట్టణం, జనవరి 20, విశాఖ తీరంలో మత్తు ఇంజక్షన్లు కలకలం రేపుతున్నాయి. పనికి రాని చిత్తు వస్తువుల వ్యాపారం వెనుక.. గత కొంతకాలంగా రహస్యంగా సాగుతోన్న గంజాయి విక్రయాల గుట్టురట్టు చేశారు స్థానికులు. పోలీసుల దాడిలో 35 మత్తు ఇంజక్షన్లు, 20 గ్రాముల సిగరెట్లలో వినియోగించే గంజాయి పౌడర్ పట్టుబడింది. నిందితులు నక్క మహేశ్వర్ రెడ్డి, మండి చైతన్య, శ్రీరామ రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన అనుపమ్ అధికారి పరారీలో ఉన్నాడు.కాలేజీ విద్యార్థులు తరచూ వచ్చిపోయే ఓ స్క్రాప్ షాప్‌పై నిఘాపెట్టిన గ్రామస్తులకు నివ్వెరపోయే నిజాలు తెలిశాయి. అక్కడ భారీగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు జరిపిన దాడిలో గంజాయు ముఠా గుట్టురటయ్యింది. పశ్చిమబెంగాల్‌లో 30 రూపాయలకు ఇంజక్షన్ కొనుగోలు చేసి.. ఇక్కడ రూ. 200 నుంచి రూ. 300 లకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది.మరోవైపు యువత భవిష్యత్‌ను నాశనం చేసే స్క్రాప్ షాపును తొలగించాలంటూ యాదవ జగరాజుపేట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రజలు. ఇక ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి కష్టమేనా

నెల్లూరు, జనవరి 20,నెల్లూరు జిల్లాలో వైసీపీకి పట్టున్న స్థానాల్లో ఉదయగిరి నియోజకవర్గం ఒకటి. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించగా బొల్లినేని రామారావు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ప్రస్తుతం టీడీపీ ఉదయగిరి ఇన్‌చార్జిగా బొల్లినేని వ్యవహరిస్తున్నారు. కాగా ఉదయగిరి స్థానం నుంచి మేకపాటి 4 సార్లు ఎమ్యెల్యేగా (ఉపఎన్నికతో సహా) ఎన్నికయ్యారు. మేకపాటికి నియోజకవర్గంలో మంచి పలుకుబడి ఉంది. పైగా బలమైన సామాజిక వర్గానికి చెందినవారు. అయినా ఈసారి జరగబోయే ఎన్నికల్లో మాత్రం మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి ఎదురుగాలి తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను అశ్రద్ధ చేస్తున్నారని, ఆయన రెండో భార్య శాంతమ్మ పెత్తనం చెలాయించడంతో కేడర్ అసంతృప్తిలో ఉన్నదని అంతర్గత సమాచారం. నియోజకవర్గంలో ఆమె పెత్తనం ఎక్కువైందని పార్టీ పదవులు ఇచ్చేందుకు నేతల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ రకంగా ఆమె షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించడం పార్టీ నేతలకు నచ్చడం లేదని తెలుస్తున్నది. అనూహ్యంగా మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జిగా మేకపాటిని తొలగించి, ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించాలని అధిష్ఠానానికి పార్టీ కేడర్ సూచించినట్లుగా సమాచారం. మేకపాటికి టికెట్ కేటాయించాలా? వద్దా? అని సందిగ్ధతలో ఉన్న సమయంలో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మూడో భార్య అంశం తెరపైకి రావడంతో రాజకీయంగా ఆయనపై విమర్శలు జోరందుకున్నాయి. మేకపాటి తీరుతో ఉదయగిరిలో ఇప్పటికే పార్టీకి చెడ్డపేరు వచ్చిందని ఇక ఆయనను కొనసాగించకుండా మరొకరికి అవకాశం ఇవ్వాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల్లో ఉదయగిరి ఇన్‌చార్జి పోస్టు నుంచి మేకపాటిని తొలగిస్తారన్న సమాచారం నియోజకవర్గంలో పుకార్లు షికార్లు చేస్తున్నది. మూడో భార్య అంశం తెరపైకి వచ్చినప్పటి నుంచి చంద్రశేఖర్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు కూడా హాజరుకాకుండా బెంగళూరులో ఉంటున్నారని తెలిసింది. ఆయనకు ఈసారి టికెట్ దక్కకపోవచ్చని తెలిసే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని వైసీపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. ఉదయగిరిలో మేకపాటి తన అంతర్గత విషయాలతో సతమతమవుతూ అభివృద్ధిని గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈసారి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పోటీ చేసినా గెలుపు సాధ్యం కాదని టీడీపీ ధీమాగా ఉన్నదని తెలుస్తున్నది. చంద్రశేఖర్ రెడ్డిని కాదని వైసీపీ మరొకరికి టికెట్ కేటాయించేంత బలమైన నేతలు నియోజకవర్గంలో లేకపోవడం వైసీపీకి బలహీనత అని తెలుస్తున్నది. టీడీపీకి ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నికల ముందే లైన్‌క్లియర్ అయిందని టీడీపీ నేతలు ధీమాగా ఉన్నట్లుగా సమాచారం.

## చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు గుండు కొట్టేసాడు..!

### జగనే మరలా ముఖ్యమంత్రి

### ఎమ్మెల్యే ప్రసన్న

నెల్లూరు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో రాష్ట్ర ప్రజలను ముంచేసాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుచ్చిరెడ్డిపాలెంలో పర్యటించారు. ఐదో వార్డ్ లోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసింది శూన్యమని ఆయన విమర్శించారు. జగన్మోహన్ రెడ్డే మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని? చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసిన జగన్ ను కదిలించలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ మోర్ల సుప్రజాతో పాటు, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు

తిరుమల తిరుమల శ్రీవారిని పెట్రోలియం న్యాచురల్ గ్యాస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. ఈ ఉదయం విఐపి విరామ సమయంలో కమిటీ చైర్మన్ రమేష్ బిధూరితో కమిటీ సభ్యులు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల కమిటీ సభ్యులు వడ్డీ రాజు రవిచంద్ర మాట్లాడుతూ.... సీఎం కెసిఆర్ నేతృత్వంలో ఖమంలో జరిగిన బిఆర్ఎస్ ఆవిర్భావ సభ బ్రహ్మాండమైన విజయాన్ని అందుకుందన్నారు. 6లక్షల మేర ప్రజలు పాల్గొని బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. ఏపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చాల మంది ప్రజలు సభలో పాల్గొన్నారని.... కేరళ సీఎం పినారై విజయన్., ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.,పంజాబ్ సీఎం భగ్వాన్త్ మాన్.,అఖిలేష్ యాదవ్ సంగీభావం ప్రకటించారన్నారు. మొదటి సభ గ్రాంట్ విక్టరీ ప్రజలు ప్రసాదించారని...మేము ఢిల్లీ వైపు చూస్తుంటే.... బీజేపీ హైదరాబాద్ వైపు చూస్తుందని వ్యాఖ్యలు చేసారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు వారికీ నచ్చని పని చేస్తే దర్యాప్తు సంస్థల్ని ప్రయోగిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వాలు పెద్దగా ప్రయోగించేవికావు....కానీ ఈ ప్రభుత్వం బాగా వినియోగిస్తుందని ఆరోపించారు.

## కడప జిల్లా చాపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన టెంపో వాహనం

కడప కడప జిల్లాలో : శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చాపాడు దగ్గర జరిగిన ఈ ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు మహిళలు దుర్మరణం చెందారు. ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీకి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు తిరుమల కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది అనూష , (30) ఓబులమ్మ ,(40) రాములమ్మ(48) అనే మహిళలు దుర్మరణం చెందగా మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు

# రేషన్ కార్డులకు రాగులు,జొన్నలు

విజయవాడ, జనవరి 20, రైతులకు మేలు చేసేలా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. దళారులు, మిల్లర్లతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు విధానాన్ని తీసుకొచ్చామన్నారు.రైతులకు ఎలాంటి నష్టం రాకుండా నేరుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. దళారి వ్యవస్థని పూర్తిగా నిర్మూలించామని, ధాన్యం సేకరించి డబ్బు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు రైతుల్ని రెచ్చగొట్టినా రైతులు మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు పలికారన్నారు. ప్రతి రైతుకు ఎకారానికి 8 వేల రూపాయల అదనపు లబ్ధి చేకూరిందన్నారు. ప్రతిపక్షాలకు చెందిన రైతులు కూడా ముఖ్యమంత్రిని ప్రశంసిస్తున్నారని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరిస్తున్నామని, రైతులకు మద్దతు ధర ప్రకటించి అమలు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 90 శాతం ఇప్పటికే చెల్లింపులు చేశామని, 21 రోజులల్లోపే ధాన్యం సేకరణకు సంబంధించి సొమ్ములు చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని ప్రకటించారు. మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.900 కోట్లు ఉన్నాయని.. మిల్లర్ల పాత బకాయిలన్నింటినీ ఈ ఆర్థిక సంవత్సరంలో క్లియర్ చేస్తామని ప్రకటించారు. ఇంటింటికీ రేషన్ ఇచ్చే ఎండీయూ వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ మొత్తాన్ని వాహనమిత్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లుస్తుందన్నారు. ఇప్పటికే ఎండీయూలు బ్యాంకులకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెల్లిస్తే వారందరికీ తిరిగి ఆ మొత్తాన్ని జమచేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 9,260 ఎండీయూ వాహనాలన్నీ పని చేస్తున్నాయని, ఏ బండీ ఆగలేదని స్పష్టం చేశారు. రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు బాగోలేదని కొంతమంది ఫిర్యాదు చేశారని, వాహనం వద్దే కందిపప్పును ఉడకబెట్టి నాణ్యత పరిశీలించాలని అధికారులను ఆదేశించామని, విచారణ కొనసాగుతోందన్నారు. లోపాలు ఉంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ కార్డు దారులకు రాగులు, జొన్నలు తీసుకునే విషయమై వాలంటీర్లతో సర్వే చేశామని, రేషన్ కార్డుదారులందరూ రాగులు, జొన్నలు కావాలని కోరారని వెల్లడించారు. ఫైలట్ ప్రాజెక్టుగా రాయలసీమ జిల్లాల్లో పేదలకు రాగులు, జొన్నలు పంపిణీ చేస్తామని, దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులందరికీ రాగులు, జొన్నలు పంపిణీ చేస్తామని మంత్రి కారుమూరి ప్రకటించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నా.. ప్రభుత్వంపై ఎలాగైనా బురదజల్లాలని ప్రయత్నాలు సరికాదని మంత్రి హితవు పలికారు. అక్కడక్కడ కొంతమంది రైస్ మిల్లర్లు వారి రాజకీయదుర్దేశాలతో సమస్యలు వచ్చాయని, ఇప్పటికే నాలుగు రైస్ మిల్లులను సీజ్ చేశామన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు పండించిన ప్రతి గింజనూ సేకరిస్తున్నామని తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు రంగు మారిన ధాన్యాన్ని మార్చి 15 వరకూ కొనాలని నిర్ణయించామని తెలిపారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేయడం వెనుక కొంతమంది దళారులు ప్రోత్సాహం ఉందన్నారు. దళారులే ఆందోళన చేయించినట్లు ఇంటలిజెన్స్ నివేదికలు వచ్చాయని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు.

# 15 ఏళ్లు దాటితే వాహనాలు 'తుక్కు' కిందే లెక్క..!

న్యూ ఢిల్లీ జనవరి 20 బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఎన్నో సంచనాలను తీసుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. వీటి వల్ల ప్రజలు ఏ మేలు జరిగిందో తెలియదు గానీ సంచనాలకు కేరాఫ్ గా మోదీ సర్కార్ నిలిచింది. తాజాగా కేంద్ర సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. 15 ఏళ్లు దాటిన అన్ని పాత వాహనాల రిజిస్ట్రేషన్లను కేంద్రం రద్దు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు కానున్నాయి. దీంతో ఇకపై 15 ఏళ్లు దాటిన పాత వాహనాలన్నీ చెలామణిలో ఉండవు. వీటన్నింటిని తుక్కు కిందకే వాహనదారులు పరిగణించాల్సి ఉంటుంది. ఈ పాత వాహనాలు రిజిస్టర్డ్ స్క్రాప్ సెంటర్లో విక్రయించాల్సి ఉంటుందని రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలుష్య నివారణలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మోటారు వాహన చట్టంలో సవరణ నోటిఫికేషన్ను విడుదల చేసింది. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వ వాహనాలు.. రాష్ట్ర ప్రభుత్వాల వాహనాలు.. కేంద్ర పాలిత ప్రాంతాల వాహనాలు.. కార్పొరేషన్ల వాహనాలు రాష్ట్ర రవాణా వాహనాలు.. పబ్లిక్ సెక్టార్ అండర్టేకింగ్ వాహనాలు.. ప్రభుత్వ స్వయంప్రతిపత్త సంస్థల వాహనాలు 15 ఏళ్లు పైబడి ఉంటే వాటన్నింటిని రద్దు చేయాల్సి ఉంటుంది. అయితే వీటిలో ఆర్మీ వాహనాలను మాత్రం చేర్చకపోవడం గమనార్హం. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 2023 నుంచి అమల్లోకి రానున్నాయి. గతేడాది నవంబర్లోనే రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఈమేరకు ఒక ముసాయిదాను విడుదల చేసింది. అందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 15 ఏళ్ల నాటి వాహనాలు అన్నింటినీ రద్దు చేయాలని సూచించింది. ఈ నిబంధనలు కార్పొరేషన్లు.. రవాణా శాఖకు చెందిన బస్సులు.. వాహనాలకు వర్తింజేయాలని పేర్కొంది. ఈ ముసాయిదాపై ప్రభుత్వం 30 రోజుల్లోగా సూచనలు.. అభ్యంతరాలను కోరింది. ఈ విషయంపై నాడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ప్రతి నగరం నుంచి 150 కిలోమీటర్ల లోపు కనీసం ఒక ఆటోమొబైల్ స్క్రాపింగ్ సౌకర్యాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కాగా ఈ తాజా నిబంధనలను కేంద్రం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనుంది. అయితే కేంద్రం నిర్ణయంపై వాహనదారుల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది.

# విశాఖ ఉక్కును పట్టించుకోని వైసిపి

### నిస్సిగ్గుగా అమ్మకానికి పెట్టినా నిలదీయలేని దైన్యం

విశాఖపట్టణం,జనవరి20 : విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు అనే నినాదంతో అనేక త్యాగాల ఫలితంగా తెచ్చుకున్న విశ్వాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమమకానికి పెట్టినా వైసిపి నేతలు నోరెత్తి విమర్శించడం లేదు. బిజెపిని నిలదీయడం లేదు. విశాఖ వచ్చిన ప్రధానితో గట్టిగా మాట్లాడలేదు. ప్రజలు పోరాడి తెచ్చుకున్న ఉక్కు ఫ్యాక్టరీ ఆందోలనలు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీనిని అమ్ముతూ ఉంటే వైసిపి నేతలు, ప్రభుత్వం సమర్థిస్తున్నదంటే ఆంధ్ర రాష్ట్రానికి ఎంతటి ద్రోహం చేస్తున్నారో ప్రజలే అర్థం చేసుకోవాలి. తెలుగు ప్రజలు ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం అమ్మేయాలని నిర్ణయిస్తే, దాన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గట్టిగా కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదో ప్రజలకు చెప్పాలి. అంతకుమించి నిస్సిగ్గుగా కేంద్ర నిర్ణయాన్ని సమర్థించడం ఆ ద్రోహంలో భాగం పంచుకోవడం కాదా? అన్నది గుర్తించాలి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం బుట్టదాఖలు అయ్యింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ పాలసీ ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారని సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను అమయాకులను చేసి ఆటపట్టిస్తే...అవకాశం వచ్చినప్పుడు తాట తీస్తారు. నేడు ఉత్తరాంధ్ర ప్రజలు గొంతెమ్మ కోర్కెలేమీ కోరడం లేదు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా దీన్ని కాపాడుకోవడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుకుంటున్నారు. పెండింగు నీటి ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలని కోరుకుంటున్నారు. పర్యావరణం పరిరక్షించబడాలని కోరుకుంటున్నారు. అభివృద్ధిని కోరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతనైతే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సి ఉంది. ప్రాంతాలు, ప్రజల మధ్య రాజధాని పేరుతో చిచ్చు మాత్రం పెట్టకూడదు.

# సమస్యల వలయంలోజగనన్న కాలనీలు: సిపిఐ



కడప రూరల్ జనవరి 20: నగరంలోని జగనన్న చలమారెడ్డి పల్లి లేఔట్ లో శుక్రవారం సిపిఐ కడప నగర సమితి బృందం పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కడప నగర సహాయ కార్యదర్శి ఉద్దె మద్దిలేటి. మాట్లాడుతూ జగనన్న కాలనీలో నీళ్లు, రోడ్లు, విద్యుత్, సదుపాయాలు, కల్పించకుండా, నేనే పూర్తి నిర్మాణం పూర్తిచేసే మీ చేతికి ఇంటి తాళాలు ఇస్తామని చెప్పిన హామీని పక్కనపెట్టి జగనన్న కాలనీలల్లో ఇల్లు కట్టుకోవాలంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. ఇన్ని రకాల సమస్యలతో సతమతమవుతున్న గ్రామ మండల జిల్లా స్థాయి అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోకపోవడం సిగ్గుచేటని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఇవ్వాలని,జగనన్న కాలనీలలో మౌలిక వసతులను కల్పించాలని వారు డిమాండ్ చేసారు. జగనన్న కాలనీ చలమారెడ్డి లేఅవుట్ లో ఇప్పటికీ మౌలికవసతుల కొరత ఉండటం దారుణమన్నారు. నీళ్లు, రోడ్లు లేక వైయస్సార్ ఇచ్చిన ఇళ్ళను సకాలంలో కట్టుకోలేక పోయిన వారందరి ఇంటి పట్టాలను ఆగమేగాలపై రద్దు చేసిన జగన్ ప్రభుత్వం ఇప్పటికీ కూడా రోడ్లు,నీళ్లు, విద్యుత్ తదితర మౌలిక సమస్యలను పట్టించు కోకపోవడం దారుణమన్నారు. జగనన్న కాలనీలో నీటి సరఫరా లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం కన్నా ముందు సింక్ నిర్మాణం చేపడుతూ, ట్రాక్టర్ నీళ్ళ ట్యాంక్ ల ద్వారా నీళ్లను రోజుకు 900 రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఒత్తిళ్ళతో ఆర్థిక అప్పుల భారంతో స్థానిక మౌలిక సమస్యలు ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కనీసం గ్రావెల్ రోడ్డు కూడా కాకుండా మట్టి దారులే ఉండటం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చే లక్షా 80 వేల రూపాయలు ఏమాత్రం సరిపోవని, పెరిగిన ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలకనుగుణంగా కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. మెయిన్ రోడ్డు నుండి లేఅవుట్ కాలనీలోకి తక్షణమే తారు రోడ్డు నిర్మించాలని, వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ ప్రజా సమస్యలపై ప్రశ్నించనదే, పోరాటం చేయనిదే తోలు మంద ప్రభుత్వానికి జనం సమస్యలు పట్టవని ఆరోపించారు. ఫిబ్రవరి 6వ తేదీన కడప కలెక్టరేట్ వద్దకు లబ్ధిదారులందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, అంకుశం, కడప నగర నాయకులు గంజికుంట నాగరాజు, ఆచారమ్మ, తదితరులు పాల్గొన్నారు

## కేంద్రలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటిచార్లెస్ గారు...

కడప జనవరి 20 : తమ జాతీయ కాంగ్రెస్ పార్టీ తోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ గారు అన్నారు. గురువారం కడప నగరంలోని ప్రయివేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు తమ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే మల్లీ ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం వస్తుందన్నారు బిజెపి నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుంచి దేశం అన్ని రకాల దివాళా తీసిందన్నారు సంవత్సరానికి యువతీ యువకులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. మైనారిటీల పై దాడులు పెరిగాయన్నారు సంక్షేమం కుంటుపడి ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా పరిశ్రమలను ప్రయివేట్ పరం చేయడం దారుణ మన్నారు ముఖ్యంగా దేశంలో దళితులు, బడుగు బలహీన వర్గాల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం ఆయన ఆలోచన విధాన్ని అమలు చేసిన ఏకైక వ్యక్తి ఇందిరాగాంధినే అన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఎంతో అభివృద్ధి చెందారని చెప్పారు కాంగ్రెస్ పార్టీ వస్తే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి





పత్తికొండ రిపోర్టర్:నూర్ పత్తికొండ మండలంలో ఐఖఖీ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ "వారి ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ ని జెండా ఊపి ..శ్రీమతి కె. శశిదీప్తి ఆదోని ఓ.ఎ.ఎ పత్తికొండ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు 34వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సంధర్భంగా ఆదోని రోడ్డు రవాణా ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా కలిసి పత్తికొండ పోలీసు కార్యాలయం నుండి పట్టణంలో రోడ్డు భద్రత పై అవగాహన కు హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోలీసు కార్యాలయం నుండితిరిగి పత్తికొండ డిగ్రీ కాలేజ్ లో రోడ్డు భద్రత పై అవగాహన తెలియజేశారు .శ్రీమతి కె. శశిదీప్తి ఆదోని ఓ.ఎ.ఎ ,, టౌన్ సిఐ మురళి మోహన్, ఆర్టీవో మోహన్ దాస్‌ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ. వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు సేఫ్టీ వారోత్సవాలలో హెల్మెట్ ధరించడం పై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే ఎంవీఐ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలకు రహదారి భద్రత, ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేయాలన్నారు. యువత అత్యుత్సాహం తో అతివేగంగా వాహనాలను డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాల బారిన పడకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండేలా, ఫోన్లో మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణీకులు వాహనాల్లో వెళ్ళకుండా పలు జాగ్రత్తలు చేపడితే దాదాపు రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ,క్రాంతి నాయుడు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కేవీ సుబ్బయ్యఐఖఖీ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ రామ్మోహన్‌పాల్గొన్నారు.

## విశాఖ నుంచి రేణిగుంటకు గుండె తరలింపు

### గ్రీన్ కారిడర్ ఏర్పాటు చేసిన పోలీసులు

తిరుపతి తిరుపతి శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ హాస్పిటల్ లో అరుదైన ఆపరేషన్ జరిగింది. బ్రెయిన్ డెడ్ పేషెంట్ సన్యాసమ్మ గుండె విశాఖ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట ఎయిర్ పోర్టుకు చేరుకుంది. తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక గ్రీన్ ఛానల్ కారిడార్ రూట్ ఏర్పాటు చేసారు. తిరుపతి శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ హాస్పిటల్ వరకు పోలీసులతో ప్రత్యేక రూట్ ఏర్పాటు, ట్రాఫిక్ రూట్ క్లియరెన్స్ చేసి గ్రీన్ ఛానల్ గా ఏర్పాటు చేసారు. జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి ఆదేశాలతో పోలీసులు సహాయక చర్యలు చేపట్టి ఎలాంటి ఆటంకం కలగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హాస్పిటల్ ఇప్పటి వరకు వెయ్యి మంది చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించింది. ఇక్కడ అరుదైన హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా చిట్వేలుకు చెందిన నరసయ్య, రాధమ్మల కుమారుడు 15యేళ్ళ విశ్వేశ్వరయ్యకు గుండే అమర్చారు.

## కౌలు రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

### సంక్షోభంలో వ్యవసాయ రంగం

### రైతులను నట్టేట ముంచుతున్న విధానాలు

ఏలూరు,జనవరి20 దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ నేతలు అన్నారు. బడా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు వ్యవసాయ భూములు లాక్కుని రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. పెద్దనోట్ల రద్దుతో రైతులు, వ్యవసాయకూలీలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. చంద్రబాబు నిర్ణయాలతో వ్యవసాయ రంగం పరిస్థితి మరింత దిగజారిందన్నారు. వ్యవసాయరంగాన్ని రక్షించుకునేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో భూతాపం పెరిగిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు 52 కమిషన్లు వేశారని, ఒక్క కమిటీ సిఫారసు కూడా అమలు చేయలేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. దిగుమతి అవుతున్న వస్తువుల సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు. స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను కూడా దిగుమతి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయని వివరించారు. చంద్రబాబు హయాంలో నీటి తీరువా వసూలు చేసే పద్ధతి ప్రవేశపెట్టారని అన్నారు. తెలిపారు.

# బాధితుల భరోసా వారికి అండాదండాబద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ



బద్వేలు ,బాధితులకు భరోసా వారికి అన్ని విధాల అండగా బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ నిలిచారు బాధితులకు ఏ చిన్నపాటి కష్టం వచ్చినా భూ సమస్యలు వచ్చిన తక్షణమే వారు ఆర్ డి ఓ ను కలిసి సమస్యను చెప్పుకుంటున్నారు సమస్య పరిష్కార దిశగా ఆర్ డి ఓ చేస్తున్నారు దీంతో బాధితుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం అవుతున్నాయి బాధితుల పక్షాన ఆర్ డి ఓ ఉండడం ఎంతో సంతోషించా తగ్గ విషయం గతములో ఎప్పుడూ కూడా ఇలా జరిగి ఉండేది కాదు బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి బద్వేల్ నియోజకవర్గంలో 7 మండలాలు మైదుకూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలు తో పాటు కాజీపేట మండలం కూడా ఉంది ఈ 12 మండలాల్లో భూముల సమస్యలు భూముల ఆక్రమణ ఎక్కువ శాతం ఉన్నాయి ముఖ్యంగా బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ భూములు వేల ఎకరాల్లో ఉన్నాయి చాలా కాలంగా భూముల ఆక్రమణ లో ప్రభుత్వ భూముల కబ్జాలు నకిలీ ఇంటి పట్టాలు రెవెన్యూ సంబంధించిన పలు అంశాలు నకిలీ లాగా తయారవుతూ అధికారులకే సవాలు విసురుతున్నాయి నకిలీల బారిన ఎంతోమంది బాధితులు పడ్డారు వారిని ఎదుర్కోలేక పోలీస్ స్టేషన్లు రెవెన్యూ కార్యాలయాలు బాధితులు తిరిగి తిరిగి గతంలో విసుగుచెంది పోయారు ఆర్డీవో దృష్టికి సమస్య తీసుకు వస్తాను అంటే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఆరు నెలల క్రితం వరకు రాజంపేటలో ఉండేది బద్వేల్ నియోజకవర్గంలోని 7 మండలాలు మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం మండలం రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేది బద్వేలు నియోజకవర్గ ప్రజలు రాజంపేట కు వెళ్లాలంటే దాదాపు రెండు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వచ్చేది ప్రజలకు గత కొన్ని దశాబ్దాలుగా ఇలాంటి పరిస్థితులు ఉండేవి బద్వేల్ లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని దాదాపు 40 సంవత్సరాలుగా రాజకీయాలకు అతీతంగా నాయకులు ప్రజాసంఘాల నాయకులు వివిధ పార్టీల కార్యకర్తలు పోరాటాలు చేశారు అయినా మొదట్లో తగిన ఫలితం రాలేదు ఇక బద్వేల్ కు రెవెన్యూ డివిజన్ రాదని నాయకులు కార్యకర్తలు ప్రజాసంఘాలు నిర్ణయించుకున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి ఈ సమస్య రావడం జరిగింది ఆయన వెంటనే బద్వేల్ కు రెవిన్యూ డివిజన్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు ఈ ఏడాది మార్చి 3వ తేదీ బద్వేలుకు రెవిన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడం మొదటి ఆర్డీవోగా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించడం చక చక జరిగిపోయాయి ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ ను మొదట్లో అందరూ ఒక ప్రభుత్వ అధికారి గానే భావించారు కానీ ఆయన రామబాణం లాంటి వ్యక్తి అని ప్రజలు గుర్తించే సరికి వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి రామబాణానికి తిరిగి ఉండదు అనే నిష్ఠసత్యం అందరికి తెలిసిన విషయమే ముఖ్యంగా బద్వేలు గోపవరం పోరుమామిళ్ల బి.కోడూరు కలసపాడు అట్లూరు కాశీనాయన మండలాల్లో భూముల కబ్జాలకు భూములు ఆక్రమణకు నకిలీ పట్టాలకు కొదవలేదు బద్వేలు పోరుమామిళ్ల కేంద్రంగా చేసుకొని నకిలీ ఇంటి పట్టాల తయారీ గ్యాంగ్ చెలరేగిపోయింది ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమేఈ గ్యాంగుల బారిన పడి ఎంతోమంది బాధితులుగా మారారు మరి కొంతమంది ఆర్థికంగా మానసికంగా నష్టపోయారు వారిని ఎదుర్కొనే ధైర్యం లేక కొన్ని కోట్ల రూపాయలు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న వారు ఎంతో మంది ఉన్నారు వీరి విషయంలో సంబంధిత అధికారులు కూడా అంటి అంటున్నట్లు ఉండేవారు ముఖ్యంగా గత మూడు సంవత్సరాల కాలంలో నకిలీ ఇంటి పట్టాల గ్యాంగులు కబ్జాదారులు మరింతగా రెచ్చిపోయి పేదవారిపై తమ ప్రతాపాన్ని చూపించారు వారి కారణంగా ఎంతోమంది బాధితులు కట్టుబట్టలతో ఉండిపోవాల్సివచ్చింది ప్రభుత్వ భూములు కబ్జాలు భూముల ఆక్రమణలు నకిలీ పట్టాలు, చెనరేగిపోతున్న సమయంలో ఆర్డిఓ గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించడం జరిగింది ఆయన బాధ్యతలు స్వీకరించిన వెంటనే నకిలీ ఇంటి పట్టాలు భూముల కబ్జాలపై పూర్తిగా దృష్టిపెట్టారు బద్వేలు కేంద్రంగా నడుస్తున్న నకిలీ పట్టాల గ్యాంగ్ పై ఉక్కు పిడికిలి బిగించారు వందల సంఖ్యలో నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకొని 26 మంది పై కేసులు నమోదు చేయించారు వీరిలో కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు ఇందులో 11 మందిని పోలీసులు విడతల వారీగా అరెస్ట్ చేశారు దీంతో బాధితులు కొంత ఊపిరి పీల్చుకున్నారు గతంలో ఏ అధికారి కూడా ఇంతటి సాహసం చేయలేదని చెప్పాలి ఆర్డీవో వెంకటరమణ ఇప్పటికీ తన ఉక్కు పిడికిలి బిగించే ఉన్నారు ఇలాంటి వారి విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి ఉండబోదని ఆయన పదేపదే చెబుతున్నారు చట్ట ప్రకారమే తాను ఇదంతా చేస్తున్నట్లు ఆర్ డి ఓ చెబుతున్నారు ఈ విషయంలో ఆర్డీవోను పలువురు అభినందనలతో ముంచేస్తున్నారు భూముల కబ్జాలు నకిలీ ఇంటి పట్టాలు అడ్డుకట్ట వేయడంతో కాదు ఇసుక అక్రమ రవాణా మట్టి తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ చాలావరకు అడ్డుకున్నారు ఆర్డిఓ తీసుకుంటున్న చర్యలతో అవినీతి అధికారుల్లో వణుకు పుడుతుంది ఆర్డీవో ఆకుల వెంకటరమణ తీసుకుంటున్న చర్యలతో బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అవినీతి అధికారులో వణుకు పుడుతుంది ముఖ్యంగా రెవిన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న చిన్నపాటి ఉద్యోగులు కూడా చాలావరకు అవినీతికి దూరంగా ఉంటున్నారు ఇదంతా ఆర్డిఓ చలవే అని చెప్పాలి ప్రధానంగా భూకబ్జాదారులు నకిలీ పట్టాలు తయారు చేసేవారు తెరమరుగయ్యారు ఇప్పటికీ కొందరు నకిలీ గ్యాంగ్ డంబికాలు పలుకుతున్నారు కానీ బయటికి రావడానికి భయపడుతున్నారు ఇది కూడా ఆర్డిఓ తీసుకుంటున్న చర్యల ఫలితం అని చెప్పాలి రేషన్ బియ్యం అక్రమాల కు కూడా ఆర్డిఓ చాలా వరకు అడ్డుకట్ట వేశారు బద్వేలు కేంద్రంగా ఎంతో కాలంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలించే గ్యాంగ్ ఎప్పటినుంచో ఉంది

# కత్రికి లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

## తెలుగు ప్రజలు రామన్న రాజ్యం కావాలని కోరుకుంటున్నారు

## తేదేపా సీనియర్ నాయకులు ఉలిగయ్య,ఆడివప్ప గౌడ్



కౌతాళం :ఆంధ్రప్రదేశ్ ప్రజలు సైకో పోవాలి సైకిల్ రావాలి అని నందమూరి తారకరామారావు రాజ్యం రావాలని కోరుచున్నారని మంత్రాలయం నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకులు, ఉలిగయ్య, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఆడివప్ప గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కత్రికి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దోపిడి, దౌర్జన్యాలను, కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ వైఫల్యలను ,అరాచక పాలన, దాచుకో దోచుకు, ఇసుక మాఫియా, ప్రభుత్వా వ్యతిరేకతను గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జగన్ పాలనకు చమరగితం పడాలని పిలుపునిచ్చారు. క్లస్టర్ అడివప్ప గౌడ్ అధ్యక్షతన ఉలిగయ్య ఆధ్వర్యంలో సురేష్ నాయుడు నిర్వహించరు. ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు,చంద్రన్న, ఈరన్న,మారెప్ప,వంపన్న, తాత, బసవ,నాగరాజు,అయ్యప్ప, స్వామి ,రామలింగన్న, ,అంబరేష్, మహదేవ, ముత్తన్న,యాలిష, రారవి మల్లప్ప, యంకొబ,పక్కిరయ్య హనుమంతు ,యాల్లప్ప,గోవిందు,విరేశ్ మరియు తెలుగు యువత కృష్ణ,గొట్టయ్య, ఉమేష్,శ్రీరామ్,నాగరాజు,మైబు తదితరులు పాల్గొని కార్యక్రమన్ని జయప్రదం చేశారు

# వలసలు పోకుండా నివారణ చర్యలు చేపట్టాలి

కౌతాళం ; వలసలు పోకుండా వెంటనే నివారణకు చర్యలు చేపట్టాలని మండల సర్పంచ్ పాల్ దినకర్ అధికారులను కోరారు. మండలం కౌతాళం గ్రామం లోని ప్రజలకు ఎమ్మెల్యే శ్రీ బాల నాగిరెడ్డి ఆదేశాల మేరకు దేశాయిప్రహ్లాద ఆచారి మరియు సర్పంచ్ పాల్ దినకర్ ఆధ్వర్యంలో బసన్న గుడి ఆవరణలో ఏర్పాట్లు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 ప్రకారం, గ్రామంలో అమలులో ఉన్న ఉపాధి హామీ పనులకు ప్రజలు పాల్గొని వలస కు మరో రాష్ట్రనికి వెళ్ళకుండా ముందస్తు జాగ్రత్తలు గ్రామ అభివృద్ధి కీ సహకరించాలని సర్పంచ్ కోరారు.అధికారులు స్పందించి వలసలు పోకుండా నివారణ చర్యలు తీసుకుంటామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ,ఏపీఓ జుబిర్ అహ్మద్ ఇసి ఖాదర్ బాషా లింగన్న (ఫీల్డ్ అసిస్టెంట్లు) తదితరులు పాల్గొన్నారు.



# అలంకారప్రాయమైన డంపింగ్ యార్డ్


నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామంలో గత ప్రభుత్వము డంపింగ్ యార్డ్ కొరకు షెడ్డును నిర్మించినారు. దానిని నేటి ప్రభుత్వము వైసీపీ రంగులు వేసి స్వచ్ఛ సంకల్ప ఎరువు సంపద అనే పేరు పెట్టి ఉన్నారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త, వేరువేరుగా విభజించి ఏ యొండ ని గ్రామపంచాయతీ వారు మైకుల ద్వారా ప్రజలకు తెలుపుచున్నారు. సేకరించిన చెత్తను అగ్గిపాలు చేస్తున్నారు.



డంపింగ్ యార్డ్, కు వెళ్లి చూస్తే ఖాళీ ప్లాస్టిక్ గ్లాసులు, తప్ప వేరే ఏమీయును చెత్త కనిపించడం లేదు. బయట ప్రదేశంలో చెత్తను కాల్చి బూడిద చేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డ్ ఉంటే కూడా ప్రయోజనం లేదు. చెత్త మన సంపద అనే ముఖ్యమంత్రి నినాదాన్ని, గాలికి వదిలివేసిన పారిశుద్ధ్య కార్మికులు.

# వరుణ్ తేజ్ కి విషెస్ చెప్పిన రామ్ చరణ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రస్తుతం టాలీవుడ్ లో హీరోగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నాడు. మెగాస్టార్ వారసత్వంతో హీరోగా అడుగుపెట్టిన కూడా వరుణ్ తేజ్ డాన్స్ ల పరంగా వీక్ అని చెప్పాలి. అందుకే బాబాయ్ పెదనాన్న అన్నయ్య తరహాలో కమర్షియల్ మాస్ ఎంటర్టైనర్ కథలని ఎంపిక చేసుకోకుండా కాస్తా ప్రయోగాత్మక కథలు యాక్షన్ థ్రిల్లర్ స్టోరీస్ ని ఎంపిక చేసుకుంటూ ముందుకి వెళుతున్నాడు.వరుణ్ తేజ్ సినిమాలలో డాన్స్ లతో ఉండే డ్యూయెట్లు అస్సలు పెద్దగా ఉండవు. అయితే యాక్షన్ సీక్వెన్స్ మాత్రం భాగా ఉండేలా చూసుకుంటారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో చేస్తున్న కొత్త సినిమా టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. గాండీవధారి అర్జున అనే టైటిల్ ని ఈ మూవీకి ఖరారు చేశారు. పోస్టర్ లో ఒక చేత్తో గన్ పట్టుకొని మరో చేత్తో రౌడీని క్రిందికి నెట్టి పట్టుకున్నాడు. ఈ పోస్టర్ బట్టి ఈ సినిమా యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్నది అని అర్ధం అవుతుంది. ఈ మూవీలో వరుణ్ తేజ్ పోలీస్ కాప్ గా కనిపిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వరుణ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర పరిశ్రమలో చాలా మంది ప్రత్యేకంగా విష్ చేశారు. ఇందులో భాగంగా రామ్ చరణ్ కూడా వరుణ్ తేజ్ కి స్పెషల్ విషెస్ చేశాడు.అందులో చిన్న వయస్సులో వరుణ్ తేజ్ ని ఎత్తుకొని రామ్ చరణ్ తీసుకున్న ఫోటోని ట్విట్టర్ లో షేర్ చేసి విషెస్ చెప్పారు. ఈ ఫోటో ఇప్పుడు ట్విట్టర్ లో వైరల్ గా మారింది. వరుణ్ తేజ్ రామ్ చరణ్ మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ ఫోటో పెర్ఫెక్ట్ రిప్రజెంట్ చేస్తుంది అంటూ మెగా అభిమానులు అందరూ కామెంట్ చేయడం విశేషం. ఇక రామ్ చరణ్ పెట్టిన పోస్ట్ పై వరుణ్ తేజ్ కూడా రియాక్ట్ అయ్యి థాంక్స్ చెప్పినట్లు తెలుస్తుంది. మొత్తానికి బర్త్ డే రోజున కొత్త సినిమా పోస్టర్ తో పాటు అన్న రామ్ చరణ్ నుంచి కాస్తా ఇంటరెస్టింగ్ గా విశేష్ ని వరుణ్ తేజ్ అందుకోవడం విశేషం.



# వాళ్ల వల్లే జబర్దస్త్ మానేశా.. అనసూయ కొత్త ట్విస్ట్..!



ఈటీవీ జబర్దస్త్ వల్ల చాలా మంది సెలబ్రిటీ హోదా తెచ్చుకున్నారు. అందులో కమెడియన్స్ అయితే వరుస సినిమా ఛాన్స్ లు అందుకుంటూ బిజీ ఆర్టిస్ట్ లు అయ్యారు. పరిశ్రమలో తమకంటూ ఒక క్రేజ్ తెచ్చుకోవడంలో జబర్దస్త్ ఫ్లాట్ ఫాం ఒక వేదికగా మారింది. అయితే ఇక్కడ చేసిన కమెడియన్స్ మాత్రమే కాదు యాంకర్స్ కి సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. అనసూయ రష్మి లాంటి యాంకర్స్ కూడా ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. ఈ షో వల్ల వారు కెరీర్ లో సూపర్ గా సెటిల్ అయ్యారని చెప్పొచ్చు.అయితే ఈ మధ్యనే అనసూయ జబర్దస్త్ నుంచి బయటకు వచ్చిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్నంత వరకు ఆ షో గురించి ఎలాంటి నెగిటివ్ కామెంట్స్ చేయని అనసూయ బయటకు వచ్చాక తన బాడీ గురించి చాలాసార్లు స్కిట్స్ లో అవహేళన చేశారని చెప్పింది అనసూయ. అయితే ఇప్పుడు కొత్తగా ఆ ఇద్దరి వల్లే జబర్దస్త్ షో మానేశా అంటుంది. ఇంతకీ అనసూయ జబర్దస్త్ షో మానేయడానికి కారణమైన ఆ ఇద్దరు ఎవరంటే ఇంకెవరు అనసూయ ఇద్దరు కొడుకులని తెలుస్తుంది.అనసూయ లేటెస్ట్ గా తన కొడుకులకు ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతోనే జబర్దస్త్ ను మానేశానని అన్నది. ఓ పక్క సినిమాల షూటింగ్స్ మరో పక్క జబర్దస్త్ ఇలా పిల్లలతో టైం స్పెండ్ చేయలేకపోతున్నా అందుకే జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేశానని చెప్పింది. అయితే ఎనిమిదేళ్లుగా జబర్దస్త్ తనకు చాలా మంచి కెరీర్ ఇచ్చిందని.. ఇప్పుడు సినిమాల్లో బిజీ అవడం వల్ల జబర్దస్త్ చేయడం కుదరట్లేదని చెప్పుకొచ్చింది అనసూయ.మొత్తానికి అప్పుడేమో బాడీ షేమింగ్ అంటూ హాట్ కామెంట్స్ చేసి ఇప్పుడు పిల్లల కోసమే జబర్దస్త్ వదిలేశానని అనసూయ చెప్పడం అందరికి షాక్ ఇస్తుంది. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో అనసూయ కెరీర్ లో ఫుల్ బిజీ అయ్యింది. పాత్రల సెలక్షన్స్ లో కూడా అనసూయ తన స్పెషాలిటీ చూపిస్తుంది. అందుకే అనసూయ చేస్తున్న పాత్రలు ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తున్నాయి.

# రావణాసుర.. మాస్ రాజా మరో స్పెషల్ అప్డేట్!

మాస్ మహారాజా రవితేజకు చాలా రోజుల తర్వాత మాంచి హిట్ వచ్చింది. ధమాకా సినిమా మంచి టాక్ తో భారీ వసూళ్లను రాబట్టింది. ధమాకా హిట్ తో రవితేజ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీలో ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన చిరంజీవి వాల్తేరు వీరయ్య సినిమాలో కూడా రవితేజ వెరీ పవర్ ఫుల్ క్యారెక్టర్ చేయడంతో వారి ఆనందం రెట్టింపు అయిందనే చెప్పాలి. వాల్తేరు వీరయ్యలో రవితేజ పాత్రకు పర్ఫార్మెన్స్ కు మంచి మార్కులే పడ్డాయి. అదే ఊపులో రవితేజ నుండి ఫ్యాన్స్ కు అదిరిపోయే వార్త వచ్చింది.ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రావణాసుర సినిమా నుండి రవితేజ పుట్టినరోజు జనవరి 26వ తేదీన సందర్భంగా ఓ వీడియో రానున్నట్లు తెలుస్తోంది. అటు రిపబ్లిక్ డే కానుకగా ఇటు రవితేజ బర్త్ డే బహుమతిగా ఈ వీడియోను తీర్చిదిద్దనున్నారు.యూనిక్ థ్రిల్లర్ జోనర్ లో రావణాసుర సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని సుధీర్ వర్మ డైరెక్ట్ చేస్తున్నారు. రావణాసుర మూవీలో అనూ ఎమ్మాన్యుయేల్ పూజితా పొన్నాడ దక్షా నగార్కర్ ఫరియా అబ్దుల్లా(జాతిరత్నాలు – చిట్టి) మేఘా ఆకాశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.అక్కినేని హీరో సుశాంత్ రావణాసుర సినిమాలో విలన్ పాత్రలో నటిస్తుండటం విశేషం. వీళ్లే కాకుండా రవితేజ రావణాసుర సినిమాలో రావు రమేశ్ మురళీ శర్మ సంపత్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ రవితేజ టీమ్ వర్క్స్ బ్యానర్లపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.రావణాసుర చిత్రం 2023 ఏప్రిల్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. త్వరలోనే ఈ సినిమా ప్రమోషన్లు మొదలు కానున్నాయి. రావణాసుర సినిమా పాటలకు సంబంధించిన షూటింగ్ మాత్రమే ఇంకా మిగిలి ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పాటల చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.



# కౌంటీల్లో ఆడనున్న స్మిత్! ద్రోహులు అంటూ ఆగ్రహం! ఇందులో తప్పేముంది?



ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తొలిసారి ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఆడనున్నాడు.ససెక్స్ జట్టు తరఫున మూడు మ్యాచ్‌లలో భాగం కానున్నాడు. ఈ విషయాన్ని స్మిత్ స్వయంగా వెల్లడించాడు. ఇప్పటికే ససెక్స్ క్రికెట్ హెడ్ పాల్ ఫాబ్రేస్‌తో మాట్లాడానని, కౌంటీల్లో ఆడనుండటం నిజమేనని ధ్రువీకరించాడు.తనకు ఇదో సరికొత్త అనుభవమన్న స్మిత్.. యువ క్రికెటర్లతో కలిసి బ్యాటింగ్ చేయడం కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నాడు. యంగ్ ప్లేయర్లతో కలిసి డ్రెస్సింగ్ రూం షేర్ చేసుకోవడం ద్వారా వాళ్లను మెంటార్ చేసే అవకాశం కూడా వస్తుందని, ఇది తనకు సంతృప్తినిస్తుందని స్మిత్ సంతోషం వ్యక్తం చేశాడు.కాగా ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ ఏడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ సన్నాహకాల్లో భాగంగా స్మిత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. స్మిత్ కౌంటీల్లో ఆడటంపై ఇంగ్లండ్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. అతడికి ఈ అవకాశం ఇచ్చిన ససెక్స్ జట్టును ద్రోహులుగా అభివర్ణిస్తూ నెట్టింట ట్రోల్ చేస్తున్నారు. యాషెస్ సిరీస్?కు ముందు ఆసీస్ ఆటగాళ్లను ఇంగ్లండ్ పిచ్‌లపై ఆడించడం ప్రతికూల ప్రభావం చూపుతుందని మండిపడుతున్నారు.అయితే, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ మైకేల్ వాన్ భిన్నంగా స్పందించాడు. స్మిత్ కౌంటీల్లో ఆడటాన్ని అతడు స్వాగతించాడు. స్మిత్ వంటి మేటి టెస్టు క్రికెటర్లు ససెక్స్ డ్రెస్సింగ్‌రూంలో ఉండటం.. యువ ఆటగాళ్లలో ఉత్సాహం నింపుతుందని, ఈ విషయాన్ని రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నాడు. ఇక ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్.. మైకేల్ వ్యాఖ్యలతో ఏకీభవించినప్పటికీ.. యాషెస్ సిరీస్(డిసెంబరులో)కు ముందు ఇలాంటి నిర్ణయం సరికాదని పెదవి విరిచాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**